## క్లుప్తంగా

### సురక్ష ర్యాలీకి తరలిన యువత

నవాబుపేట: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సురక్ష ర్యాలీకి మండలం నుంచి పెద్ద ఎత్తున యువ నాయకులు ద్విచక్రవాహనాలతో ఆదివారం తరలి వెళ్లారు. ఎస్‌ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 23 సంవత్సరాల తర్వాత ఒకచోట చేరి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు శ్రీను, కేశవ్, మహేష్, రవి, పర్వతాలు, జయప్రకాష్, సునీత తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక విద్యా భారతి హై స్కూల్‌లో 1995–96లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా మళ్లీ ఒకచోటకు చేరి గత స్మృతులను నెమరువేసుకున్నారు. చంద్రప్రకాష్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సతీష్‌కుమార్, రాంబాబు, జగదీష్, టి.శ్రీను, కల్యాణ్, శేఖర్, ఫయాజ్, ఎనుగొండ శ్రీను, డి.మాధవి, సునీత, శ్వేత, స్రవంతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలు

మిడ్జిల్: బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ కథనం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్లకు చెందిన విష్ణు మహబూబ్‌నగర్ నుంచి తన స్వగ్రామానికి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో కొత్తపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఘటనలో అతడికి త్రీవంగా గాయలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆకట్టుకున్న పౌరాణిక నాటకాలు



జడ్చర్ల టౌన్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పాతబజార్ హనుమాన్ ఆలయం వద్ద జనతాసేవాసమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణరాయబారం, పడకసీను, శ్రీకృష్ణాంజనేయయుద్ధం నాటకాలను ప్రదర్శించారు. వరకవుల నరహరిరాజు దర్శకత్వం వహించారు. కాగా అయ్యన్న, దుర్వాసరాజు, జగన్‌ల నటన ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా కళాకారులను రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ సత్కరించారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీరస్వామి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ గణేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరసింహ, ఆంజనేయులు, యాదయ్య సాగర్, వెంకటేష్, కరుణాకర్‌గౌడ్, కుర్మన్న, కృష్ణయ్య, జానకిరాములు తదితరులు ఉన్నారు.

### రైల్వే ప్రమాద మృతులకు నివాళి




మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాద మృతులకు పాలమూరు యూనివర్సిటీలో ఆదివారం పుటా ఆధ్వర్యంలో ఒప్పంద అధ్యాపకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. బాధిత కుటుంబాలు మనోధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (పుటా) నాయకులు భూమయ్య, రవికుమార్, అర్జున్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రాజ శేఖర్, గాలన్న, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ ప్లాట్లు మురుగుమయం

- బీఎన్‌రెడ్డికాలనీ, శేషాద్రినగర్‌లో ఎక్కడికక్కడ సీసీరోడ్లు ధ్వంసం
- చాలా చోట్ల మట్టిరోడ్లే శరణ్యం
- వర్షం వచ్చిందంటే వణుకే

ప్రధాన వీధులు: శేషాద్రినగర్, నిషాత్‌నగర్, బీఎన్‌రెడ్డి కాలనీ, బీకేరెడ్డి కాలనీ (కొంత భాగం), బోయినగోపాల్ కాలనీ, మణికంఠ కాలనీ (కొంత భాగం), మహేశ్వరికాలనీ
21వ వార్డులో జనాభా: 5,304



బీఎన్‌రెడ్డికాలనీ వెనుక భాగంలో నిలిచిన మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డులో ఎన్నో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా పెద్దచెరువు పక్క నుంచి ఈ వార్డు మధ్యలో నుంచి పెద్ద కాల్వ ప్రవహిస్తోంది. భారీ వర్షం కురిస్తే చాలు ఇది నిండిపోయి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతాయి. దీంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తున్నందున మురుగు అందులో చేరకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా వరదను పెద్దకాల్వకు మళ్లించడంతో పూర్తిగా నిండిపోయి బీఎన్‌రెడ్డి కాలనీ, శేషాద్రినగర్, బోయినగోపాల్ కాలనీ, నిషాత్‌కాలనీ, మహేశ్వరికాలనీలో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోతోంది. ఇళ్లలోకి మురుగు కలిసి వస్తుండటంతో స్థానికులు వణికిపోతున్నారు. ఈ వీధులతో పాటు బీకేరెడ్డి కాలనీలోనూ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొన్ని ఓపెన్ ప్లాట్లు మురుగుతో నిండిపోయాయి. మరోవైపు ఇళ్ల నిర్మాణం జోరుగా కొనసాగుతోంది. ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దిక్కయ్యాయి. బీకేరెడ్డికాలనీ, శేషాద్రినగర్, బీఎన్‌రెడ్డి కాలనీల్లో మూడేళ్ల కిత్రం మిషన్ భగీరథ పథకం పైపులైన్ కోసం సీసీరోడ్లను తవ్వినా సరిగా పూడ్చలేదు. దీంతో గతుకులమయంగా తయారయ్యాయి. ఇక బోయినగోపాల్ కాలనీలో అన్నీ మట్టిరోడ్లే.. అవీ అస్తవ్యస్తంగా ఉన్నాయి.



శేషాద్రినగర్ (వీధి నం. 07) లోని ఓపెన్ ప్లాట్‌లో నిండిన మురుగు



శేషాద్రినగర్ కమాన్ నుంచి లోపలికి క్లే దారిలో ఇలా..

### మట్టిరోడ్లే గతి..

మా కాలనీలో మట్టిరోడ్లే గతి. వర్షం కురిస్తే చాలు పెద్దకాల్వ నిండి పొంగి పొర్లి చుట్టుపక్కల ఇళ్లలోకి మురుగుతో కలిసి వస్తుంది. మొత్తం దుర్గంధం వెదజల్లుతుంది. పెద్ద వాహనాలు, చివరకు బైక్‌లు సైతం నడిపే పరిస్థితి ఉండదు. చుట్టుపక్కల పిచ్చి మొక్కలు తొలగిస్తే బాగుంటుంది. కొన్ని నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్నపిల్లలను బయటకు పంపించాలంటేనే భయం వేస్తుంది. చెత్త తీయడానికి పారిశుద్ధ్య కార్మికులు సరిగా రావడం లేదు.

– ఎండీ రహమతుల్లా షరీఫ్, నిషాత్‌కాలనీ/శేషాద్రినగర్

### సీసీరోడ్లు తవ్వి వదిలేశారు..

కొన్నేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం కోసం వీధుల్లోని సీసీరోడ్లను అడ్డంగా తవ్వి సరిగా పూడ్చలేదు. తాగునీటిని నిర్దిష్ట సమయంలో వదలాలి. గంటసేపే వస్తుండటంతో సరిపోవడం లేదు. పెద్దచెరువు పక్క నుంచి వర్షపునీటిని మళ్లించడంతో ఇళ్లలోకి వస్తున్నాయి. మురుగుతో దుర్గంధం భరించలేకున్నాం. లోతట్టు ప్రాంతం కావడంతో ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచి పేరుకుపోతుంది. పవర్‌బోరును మరమ్మతు చేయించినా ఉపయోగం లేకుండా పోయింది. విద్యుత్ కనెక్షన్ సరి చేయకపోవడంతో వృథాగా ఉంది.

– కాళ్ల బుగ్గయ్య, రిటైర్డ్ ఎక్సైజ్ ఉద్యోగి, బీఎన్‌రెడ్డి కాలనీ

### సమస్యలను పరిష్కరిస్తాం

వార్డు పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ మూడున్నర ఏళ్ల కాలంలో సుమారు రూ. కోటి అభివృద్ధి పనులు చేపట్టాం. ఇటీవలే రూ.6 కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర పనుల కోసం ప్రతిపాదనలు పంపాం. అయితే రూ.2 కోట్లు మాత్రమే మంజూరు కాగా రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా పెద్ద కాల్వను పక్కాగా నిర్మిస్తున్నాం.

– ఎ.ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్, 21వ వార్డు

# వాననీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

మహమ్మదాబాద్/గండేడ్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులకు తీవ్రంగా నష్టం కలుగుతోంది. అమ్ముకోవడానికి సిద్ధంగా కల్లాల్లో ఉంచిన ధాన్యం వానలకు తడిసి ముద్దవుతోంది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి మండల పరిధిలోని గాధిర్యాల్, నంచర్ల, మొకర్లాబాద్, మహమ్మదాబాద్, గండేడ్ మండల పరిధిలోని చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, జక్లపల్లి, వెన్నాచేడ్ తదతరి సెంటర్లలో వరిధాన్యం తడిసింది. కొన్నిచోట్లు వాననీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చినా అధికారుల నిర్లక్ష్యం వల్ల వెంటనే తూకం చేయడం లేదని అంటున్నారు. దీంతో అక్కడే నిల్వఉంచడంతో వర్షాలకు తడుస్తున్నాయని వాపోతున్నారు.



పెద్దవార్వాల్‌లో కొట్టుకుపోయిన ధాన్యం

# బీటీరోడ్డు మరమ్మతుకు రూ.30 లక్షలు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: మండల కేంద్రం నుంచి పెద్దరేవల్లి వరకు దెబ్బతిన్న బీటీరోడ్డు మరమ్మతుకు ఆదివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ. 30 లక్షల నిధులు మంజూరు చేశారు. దెబ్బతిన్న బీటీరోడ్డును పరిశీలించి తక్షణమే నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకునేవిధంగా చూస్తానని ఆయన అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రజిని, నాయకులు పాల్గొన్నారు.

### 19న హరితహారం

భూత్పూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19 చేపట్టే హరితహారాన్ని విజయవంతం చేయాలని డీఎఫ్‌వో సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కర్వెన ప్రాజెక్టును డీఆర్‌డీఏ యాదయ్యతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉత్సవాలల్లో భాగంగా కర్వెన ప్రాజెక్టు వద్ద భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎఫ్‌వో వివరించారు. స్థలాన్ని పరిశీలించి జేసీబీ సహాయంతో ముళ్లకంపలను, రాళ్లను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఐదు జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులలో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సమన్వయ అధికారి శ్రీవాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్‌లో నాలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీలో మూడు చొప్పున, తెలుగు, గణితం, బాటనీ, సైకాలజీలో రెండేసి, కామర్స్, సివిక్స్‌లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో ఈనెల 6న రాంరెడ్డి గూడెంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్–జేసీ(జీ) లో హాజరుకావాలన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కోటేశ్వర్ రెడ్డి, రెహమాన్, శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షురాలిగా హేమలత, సహా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా విద్యాధర్, జితేందర్, రాధ, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం, కార్యనిర్వహణ కార్యదర్శులుగా మహేశ్వర్, వంశీకృష్ణ, కొండయ్య, కోశాధికారిగా సంతోష్‌కుమార్ రెడ్డి, క్రీడల కార్యదర్శిగా సత్యనారాయణ, సాంస్కృతిక కార్యదర్శిగా ఆనంద్‌బాబు, మహిళ ప్రతినిధిగా సరస్వతి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, శిరీష, శివకుమార్, భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

# కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ ఉపాధ్యక్షులు, సీనియర్ మాస్టర్ కె.నర్సిములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌బెల్టు మాస్టర్ కె.అక్షయ, వెంకట్రాంరెడ్డి, దేవరాం, జి.శ్రీను, హరి, రామాంజనేయులు, సాంబశివుడు, అరుణ తదితరులు పాల్గొన్నారు.



బెల్టులు పొందిన విద్యార్థులతో నర్సిములు తదితరులు

# తైక్వాండోను అభివృద్ధి చేయాలి



బెల్టులు పొందిన విద్యార్థులతో గిరిధర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మండలస్థాయిలో తైక్వాండోను అభివృద్ధి చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.సాయిలు, సీనియర్ మాస్టర్ శంకర్ ఆధ్వర్యంలో బీపీహెచ్‌ఎస్‌లో వేసవి తైక్వాండో శిబిరంలో భాగంగా ఆదివారం ప్రత్యేక శిక్షణ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్‌బెల్టు సీనియర్ క్రీడాకారులు రవి, శ్రీరాం, శివకుమార్, బాలవర్ధన్, రఫీ, అరవింద్, ప్రణవసాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు కవుల జిల్లా



వేగుచుక్క కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ రచించిన 'వేగుచుక్క' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పాలమూరు కవుల జిల్లా అన్నారు. ఒకప్పుడూ పాలమూరు జిల్లా అంటే వలసల ఖిల్లా అని పేరుండేదని, ఇప్పుడు ఇక్కడికే వలసలు వస్తున్నారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్‌గౌడ్ కవిత్వంలో విభిన్న వస్తువులు కన్పిస్తాయన్నారు. తనదైన శైలిలో కవిత్వం రాయడం ప్రత్యేకతన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సమాజంలో మార్పును తీసుకురావడానికి కవిత్వం దోహదం చేస్తుందన్నారు. ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్‌గౌడ్‌ను కొనియాడారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ సమీక్ష చేశారు. కార్యక్రమంలో పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, జగపతిరావు, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, బాదేపల్లి వెంకటయ్యగౌడ్ తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

**క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి..**

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా 25వ వేసవి ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మంచి ఆరోగ్యం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. జహంగీర్‌పాష ఖాద్రీ 25 ఏళ్ల నుంచి వేలాదిమందికి కరాటే శిక్షణ ఇస్తుండడం అభినందనీయమని అన్నారు. జిల్లా కేంద్రంలో పెద్ద పెద్ద కంపెనీలు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆరు మైనార్టీ గురుకులాలు, కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1000 గజాల స్థలంతోపాటు రూ.10లక్షలు కేటాయిస్తానని తెలిపారు. ఇక్కడ పోలీస్, ఎస్‌ఐ పరీక్షలు రాసే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ముగింపు వేడుకల సందర్భంగా విద్యార్థుల కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేసవి కరాటే శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, జేపీఐటీఏ అధ్యక్షుడు జఫర్‌షా, కౌన్సిలర్లు, ఈద్గా కమిటీ అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

### కూలీలకు 'ఉపాధి' పై అవగాహన

నవాబుపేట: కాకర్లపహాడ్, సిద్దోటం గ్రామాల్లో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో కూలీలకు ఉపాధి హామీ చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలు అందించి చారు. సంఘం నాయకులు విజయలక్ష్మి, వెంకటయ్య, శ్రీనివాస్ మాట్లాడారు. నాయకులు అంజనేయులు, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.



### చిల్వేర్‌లో బొడ్రాయి వేడుకలు

మిడ్జిల్: చిల్వేర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి, కోటమైసమ్మ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంయుక్తరాణి, జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీపీ సుదర్శన్, నాయకులు బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో ఏరువాక పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని మణికొండ, అప్పాయిపల్లి, కోటకదిర, దివిటిపల్లి, ఫతేపూర్, వెంకటాపూర్, మాచన్‌పల్లి తండా, ధర్మాపూర్, చౌదర్‌పల్లి, ఓబ్లాయిపల్లి, మాచన్‌పల్లి గ్రామాల్లో రైతులు తమ పశువులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కాడెద్దులతో ఊరేగింపు చేపట్టారు. చివరగా ఏరువాక తాడును తెంచిన తరువాత ప్రజలు ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. కౌకుంట్ల మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించరు. సర్పంచ్ స్వప్న, నాయకులు కిషన్‌రావు ఆధ్వర్యంలో ఎడ్ల బండ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. కౌకుంట్ల బస్టాండ్ రోడ్డుపై ఏరువాక తాడు తెంచే కార్యక్రమం పిల్లలు, పెద్దల కేరింతల మధ్య ఘనంగా చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహమ్మదాబాద్/గండేడ్: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, యువకులు, రైతులు పాల్గొన్నారు.



కౌకుంట్లలో ఎద్దుల బండ్ల ఊరేగింపు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో ఆదివారం సాయంత్రం ఎరువాక పౌర్ణమి నిర్వహించారు. గ్రామంలోని రైతులు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం రామలింగేశ్వరాలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. తర్వాత స్వామి వారి ఆలయం ముందు ఉన్న రథం చుట్టు వాహనాలతో ప్రదక్షిణ చేపట్టారు. మూసాపేట మండలంలోని పలు గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



దమగ్నాపురంలో..



మణికొండలో..



కందూర్‌లో ఎద్దుల బండ్లతో ర్యాలీ



దాసర్‌పల్లిలో..



కందూర్ ఆలయం వద్ద ట్రాక్టర్లతో ప్రదక్షిణలు



జాలపల్లిలో..